# జ్వరమా? వదిలిపోకు



ఇదిగో! ఈ రెండు టాబ్లెట్స్ తీసుకోమ్మా! ఇందులో ఈ పెద్దది పూటకు ఒకటి చొప్పున మూడు పూటలా వేయి. ఈ చిన్న టాబ్లెట్‌ను ఇప్పుడొకటి రాత్రికి ఒకటి వెయ్యి. రేపు పొద్దుటికి జ్వరం తగ్గిపోతుంది. మళ్ళీ రేపు వచ్చి చూస్తాను'' పక్కింటి డాక్టరంకుల్ అమ్మతో చెబుతుంటే శ్రద్ధగా వింటున్న అమలకు ఏడుపు ముంచుకొచ్చింది.

''వారం రోజుల నుంచి రోజూ జ్వరం ఎంతో కొంత ఉంటూనే ఉందండీ. నాకెందుకో భయంగా ఉంది'' అంటోంది అమ్మ. ''ఏం ఫర్వాలేదమ్మా! రేపటికి తగ్గిపోతుందంటున్నాగా. మధ్యలో అవసరం అయితే పిలువు. మళ్ళీ రేపు వస్తాము'' ముందు గదిలో నుంచి డాక్టరంకుల్ వెళ్ళిపోతున్న బూట్ల చప్పుడు.

తనకి జ్వరం రేపటితో తగ్గిపోతుందట. అమ్మో! అప్పుడే జర్వం తగ్గిపోతే ఎలా? జ్వరం తగ్గీ తగ్గగానే అమ్మ ఆఫీసుకి వెళ్లాలంటుంది. మళ్ళీ రోజూ మామూలే. కాన్వెంట్ నుంచి పుస్తకాల సంచీ మోసుకుంటూ తిరిగొచ్చి అమ్మ వచ్చేవరకు వరండాలో బిక్కుబిక్కుమంటూ మంచం మీద కూర్చుని హోంవర్కు చేసుకోవాలి. ఏ అమ్మ ఎప్పుడూ ఇంతే. తనకేమో ఎంచక్కా ఎప్పుడూ అమ్మ దగ్గరే ఉండాలనుంటుంది. అమ్మేమో ఎప్పుడూ ఆఫీసు, ఆఫీసు అంటుంది. పొద్దున్నే గబగబా వండేసి ఇద్దరికీ రెండు బాక్స్‌ల్లో సర్దేస్తుంది. నిద్ర కళ్లతోనే తనని లేపేసి స్నానం చేయించి యూనీఫాం వేసేస్తుంది. తరువాత తనూ స్నానం చేసి ఇంటికి తాళంవేసి ఏడింటికల్లా ఆఫీసుకెళ్ళిపోతుంది.

తనకి మళ్ళీ ఆ మంచమే గతి. కాన్వెంట్ బస్ వచ్చేవరకు యూనిఫాం నలగకుండా జాగ్రత్తగా మంచంలోనే కూర్చోవాలి. బస్సు రాగానే బయటపడి మళ్ళీ సాయంత్రం ఆరింటికి ఇంటికి వస్తే ఎదురుగుండా తాళంకప్ప. తనకి ఒక్కోసారిగా ఏడుపొచ్చేస్తుంది. పక్కింటి ఆంటీ సుష్మ రాగానే ఎత్తుకుని ముద్దులు పెట్టుకుంటూ ఇంట్లోకి తీసుకెళుతుంది. బూట్లు, సాక్స్ విప్పి చక్కగా స్నానం చేయించి తెల్లగా మెరిసిపోయే ఫ్రాకు వేసి ఎత్తుకుని టిఫిన్ తినిపిస్తుంది. బస్సు రావడం లేటైతే అప్పుడు మా డాలి ఆంటీని. ఇంక గుమ్మంలోనే నుంచుని రోడ్డు వైపు ఎంత దిగులుగా చూస్తుందో.

ఆ ఆదిత్యను మాత్రం వాళ్ల మమ్మీ ఎంత ముద్దు చేస్తుందీ? కాన్వెంటు నుంచి రాగానే వాడెంత హుషారుగా ఎగురుకుంటూ వెళతాడు. అందరినీ స్కూలు నుంచి రాగానే వాళ్ల మమ్మీలు ఎత్తుకుని కబుర్లు చెబుతూ ఏవన్నా తినిపిస్తారు. తను మాత్రం పొద్దున అమ్మ బ్యాగులో వేసిన నాలుగు బిస్కట్లు తిని మంచినీళ్ళు తాగి హోంవర్కు చేసుకోవాలి. అలాంటప్పుడే తనకి ఏడుపు ముంచుకొస్తుంది. ఎప్పుడైనా తను వచ్చేటప్పుడు అమ్మ ఇంట్లో ఉండకూడదూ? తనను సుష్మ వాళ్ళ అమ్మలాగా ఎత్తుకుని ముద్దుచేస్తూ టిఫిన్ తినిపించకూడదూ? వాళ్ళమ్మా వాళ్లంతా ఇంట్లో ఉంటే అమ్మ ఒక్కతే ఎందుకు బయటకు పోతుంది?

అమ్మకూడా ఇంట్లో ఉంటే చక్కగా అమ్మా, తను ఎంత హాయిగా ఉండొచ్చు. అమ్మనదే అడిగింది ఒకసారి. అప్పుడు మరి అమ్మ ఏడ్చింది ఎందుకో. తనవెత్తుకుని ''ఉండుమరా కన్నా! ఇంట్లో ఉండి నిన్ను కూడా మల్లెపూలాగే పెంచుకుందునురా తల్లీ. మన రాత బాగుండి మీ నాన్న ఆ యాక్సిడెంట్‌లో పోకపోతే నిన్ను కంటికి రెప్పలాగే కాచుకుని ఉండేదాన్నమ్మా. రోజూ పొద్దున్నే బయలుదేరి రెండు బస్సులు మారి లేటైతే ఆఫీసర్ ఏమంటాడోనని బిక్కుబిక్కుమంటూ అక్కడ అందరి ఆకలి చూపులు తట్టుకుంటూ నన్ను కాదన్నట్టు పనిచేసుకోవడం నాకు మాత్రం ఇష్టమా తల్లీ! పనిచేసుకుంటూ నా చిట్టితల్లి ఏం తింటుందో, ఏం చేస్తోందో, ఇంటికి టైమ్‌కి వెళ్ళగలనో లేదో, వెళ్ళకపోతే ఏడుస్తుందేమో, పిచ్చిముండలాగా మంచంమీద పడుకుని ఎదురు చూస్తుంటుందేమో అనుకుంటూ అనుక్షణం చస్తూ పనిచేసుకోవడం నాకు ఇష్టమనుకున్నావా తల్లీ! మనిద్దరికీ ఇంత తిండి దొరకాలని, నిన్ను గొప్ప చదువులు చదివించాలనే ఆశ లేకపోతే నేనూ నీ దగ్గరే ఉండిపోదును తల్లీ. ఉండి సుష్మ వాళ్ల అమ్మలాగా నిన్ను కూడా ఎత్తుకుని ముద్దులాడేదాన్ని'' అంటూ ఏంటేంటో చెబుతుంది. అందులో తనకి కొంత అర్థమవుతుంది కొంత అర్థంకాదు. అర్థమయ్యేటట్లు తను చదువుకోవాలంటే అమ్మ ఆఫీసుకెళ్ళాలి. అదొక్కటే.

తనకు ఇంకేం అక్కరలేదు. సుష్మ ఆడుకునే రాకెట్లు, కార్లు వద్దు. వాళ్ల దినేష్ కున్న బొమ్మలూ వద్దు. రమ్యనున్న పట్టులంగాలు, జడకుచ్చులూ కూడా వద్దు. అమ్మ ఇంట్లో తనతో ఉండి కరువుతీరా మాట్లాడితే చాలు.

అందుకే తనకి జ్వరం అంటే ఇష్టం. సుష్మ వాళ్ళంతా జ్వరం అంటేభయపడతారు.జ్వరంవస్తే కాన్వెంటు పోతుందిట. ఏంపోతే? అమ్మకన్నా కాన్వెంటు ఎక్కువాఏంటి? తనకి మాత్రం జ్వరం అంటనే ఇష్టం. జ్వరం వస్తే కొంచెం నీరసంగా ఉన్నా అమ్మ ఎంచక్కా తనదగ్గరే ఉంటుంది. ఆఫీసుకి వెళ్ళదు. మంచం పక్కనే కూర్చుని ఎలా

జి. లక్ష్మి

ఉందిరా కన్నా అంటూ చెయ్యివేసి నిమురుతుంది. గ్లాకోజ్ తాగుతావా తల్లీ, కమలా తింటావా అంటూ ప్రేమగా అడుగుతుంది. తనమీద చెయ్యివేసి జోలపాడుతూ నిద్ర పుచ్చుతుంది. తనకి నిద్ర రాకపోతే ఎన్ని కథలు చెబుతుందనీ.

అప్పుడు అమ్మ అచ్చం కొత్త అమ్మలా అన్పిస్తుంది. తనకైతే అమ్మని ముద్దు పెట్టుకుని నువ్వు ఎప్పుడూ ఇక్కడే ఇలా ఉండకూడదమ్మా! అని అడగాలనిపిస్తుంది. అడిగితే అమ్మ ఏడుస్తుందేమో అని అడగదు. కాని ఆ మాటను లోపల ఎన్నిసార్లు అనుకుంటుందీ.

రెండురోజుల్నుంచీ అమ్మ, తనూ హాయిగా ఇంట్లోనే ఉన్నారు. రేపు జ్వరం తగ్గితే అమ్మ ఎల్లుండి ఆఫీసుకి వెళ్ళిపోతుంది. మళ్ళీ కాన్వెంటూ, తాళంకప్పా, డ్రైవర్ తిట్లూ, బాక్స్‌లో బిస్కట్లూ అన్నీ మామూలే. ఉహూ! తనకి జ్వరం తగ్గకూడదు. ఇంకాఇంకా బాగా రావాలి. అమ్మ తన దగ్గరే ఉండిపోవాలి. తనకు చదువు లేకపోయినా ఫర్వాలేదు. అమ్మతో తనివితీరా కథలు, కబుర్లు చెప్పించుకోవాలి. "దేవుడా! నా జ్వరం ఇంకా ఎక్కువయ్యేలా చూడు. ఇప్పుడిప్పుడే తగ్గొద్దు. ఇంకేం అడగను. ఇదొక్కటే" చెంపలమీంచి కారుతున్న నీటిని తుడుచుకుంటూ అమల మనసులో దేవుణ్ణి కోరుకుంటోంది.

ఆ పక్కనే ఉన్న గదిలో అమ్మ అదే కన్నీళ్లతో తన జ్వరం తగ్గేలా చూడమని ప్రార్థిస్తోందని తెలియని అమల జ్వరం తగ్గకుండా ఉండాలంటే ఏం చేయాలా అని ఆలోచిస్తోంది. తన జ్వరం వల్ల జీతంలో ఆరు రోజుల కోత తలుచుకుని ఆ నెలంతా ఎలా గడపాలా? మందులు, పళ్లకు డబ్బు ఎక్కడ నుండి తేవాలా అని ఆలోచిస్తూ యముడిలాంటి ఆఫీసరు గుర్తొచ్చి గడగడలాడుతూ ఆ మూల అమ్మ కన్నీరెట్టుకుంటోందని తన జ్వరం పెరిగితే అది అమ్మని ఇంకా ఏడ్పిస్తుందని తెలియని ఆ చిన్నారి ఇంకా ఆలోచిస్తూనే ఉంది.


"కన్నా! ఈ బిళ్లలు వేసుకోమ్మా! రేపటికి జ్వరం తగ్గిపోతుంది. ఎంచక్కా కాన్వెంటుకి పోవచ్చు" అంటూ టాబ్లెట్స్‌తో గదిలోకి వచ్చిన అమ్మను చూడగానే అమలకు చటుక్కున ఉపాయం తట్టింది.

"నేను వేసుకుంటానమ్మా! నువ్వెళ్లులే" అన్న కూతురు ముద్దుమాటలకు కన్నీళ్లతో లోనకు నడిచింది ఆవిడ.

ఒక్క నిముషం ఆగి ఆ టాబ్లెట్లను కిటికీలోనుంచి బైట ఉన్న ముళ్ళకంపల్లోకి పారేసి "అమ్మయ్యా! ఇప్పుడింక జ్వరం తగ్గదు" అంటూ పొంగిపోయింది అమల.

# శుభం! శుభం! జన్మదినం

అక్టోబర్ 1వ తేదీ నుండి 7వ తేదీ లోపల పుట్టిన ప్రియ పాఠకులకు ఉదయం నవతరం వారపత్రిక శుభాకాంక్షలు అందిస్తోంది.




యెనిశెట్టి అంజయ్య
పుట్టిన తేదీ
1–10–89
రామాయంపేట.



వడ్లూరి శ్రీనివాస్‌గౌడ్
పుట్టిన తేదీ
2–10–89
మెదక్.




జి.చైతన్య
పుట్టిన తేదీ
3–10–89
మహబూబ్‌నగర్.




కె.నారాయణస్వామి
పుట్టిన తేదీ
4–10–89
దోమలగూడ.



కె.రాజు
పుట్టిన తేదీ
5–10–89
నిజామాబాద్.



కె.రాజలింగం
పుట్టిన తేదీ
6–10–89
హైదరాబాద్.



సిహెచ్.సుందర రామానంద
పుట్టిన తేదీ
7–10–89
జీడిగుప్ప (బాలానందపురం)

అక్టోబర్ 15వ తేదీ నుండి 21వ తేదీ లోపల పుట్టిన ప్రియ పాఠకులూ... మీ ఫోటోతోపాటు ఈ కూపన్ జతచేసి పంపండి, ప్రచురిస్తాం.

కూపన్

పేరు: ____________
పుట్టినతేదీ: ____________
చిరునామా: ____________
సంతకం: ____________

**గమనిక**

ఉదయం నవతరం వారపత్రిక ముఖచిత్రాలు 22–9–89 సీత, 15–9–89 రాధ ట్రాన్స్‌పరెన్సీలు తీసిన వారు ఎస్. శివన్నారాయణగా గమనించ కోరుతున్నాం.

—ఎడిటర్

**గమనిక**

15.9.89 సంచికలో ప్రచురించబడిన 'పార' కథారచయిత పేరు టి.వి రామాచారి అని ప్రచురించాం దాన్ని టి.రామాచారిగా చదువుకోగలరు.

ఎడిటర్